# సూరి సచ్చింది

అచ్చియ్యమాఁవా, ఆడిమేనల్లుడు పోలెప్పి - కరాపూర్లో ఆడ్ని పోల్నాయుడని పిలస్తారుటంతా-నందిగాడి సెర్లో తానానికి దిగేరు. సూరిముండని మట్టి సేసేసియిదిగిలాగొస్తన్నమాటాల్లిద్దరూ. మావింటికొచ్చిన పాపానికి యీడిక్కాడా-ఎవుడికి ? ఈ పోలప్పి గాడిక్కాడా వోటా తగిలింది, అనాదిశవాన్ని తగలబెడ్డంల. సెర్లో దిగి తానాలుసేసేసి మరీ యింటికెల్దాఁవ్రా- యింటికాడ నీళ్ళిమ్మంటే మీయత్త సిరమెర్లాడతాది, మరా ముసిలిముండాకూతురు మాత్రం యెన్నిదపాలు తిరుగుద్దిసెప్పు, సెరువుకి యింటికీ- అని మేనల్లుడికి బోదపర్సి సెర్లో దింపేడు లచ్చియ్యమాఁవ. కరాపూర్లో ఎలాటెల్లాటి కొలాయి లుంటాయో, ఎలాటెలాటి తానాలగదుల్లో మడుసు లొల్లుకడుక్కుంటారో - ఈ వివరాలన్నీ యింతకు మునుపే సెప్పీసినాడు పోలెప్పి- మావొక్కడికేకాదు, పూరేవత్తుకిన్నీ.వూర్లో పెద్దాపిన్నకి, గుంటాగుపిక్కీ - పోలెప్పిగాడంటే పేద్దాపీసరన్నమాట. కరాపూర్లో రైలింజన్లకాడ ఈడికేదో పెద్దదే నౌకిరట. వందపైనే ముడతాదట జీతం. కసిపీ లేపీ దొరకవట గానీ తట్టడో, బుట్టడో రాచ్చసిబొగ్గుముక్కలు మాతరం దొరుకుతాయట, ఇంజిన్లల్లి కిందపడిపోయినవి. అవొట్టుకెల్లీడు టీ కొట్లకాడ. బడ్డీకొట్లకాడ అమ్మితే పతిరోజు రెండోమూడో సేతలపడతాయట. ఈ పెకా రంగాదొరికిన్డబ్బుల్తో ఈడింటికి బత్తేవ్ ఎల్లిపోద్దట. మరి జీతఁవల్లా కరాగా నిలవా అయిపోడఁవే గదా- అదిగలాపోగుసేసేన్డబ్బుతోనే సంవత్సరానికోపాలి ఆడిక్కడ సెక్కా, ముక్కా కొంటుంటాడు.

సూరిముండన్తగలబెట్టనానికోపాలిరారాఅని లచ్చియ్యమాఁవమాటొర్సకనగానే పోలెప్పిగా డెల్నాడంటే వుత్తి పున్నెనికెల్లిపోనాడేటి ? నిరుడేకదా సూరిముండకాడ కొన్న పోరంబోకు మడికి పన్జేయిచ్చి సాగులోకొట్టుకొచ్చినాడు. కంకర్దెప్ప ముండా, ఆమడకన్నీకేయేనా పండాలా సావాలా, యింతకంటే నా కొడుకేనా నీ కెక్కువిస్తాడేటి అని దాని పేణాలు కొరికీసి దానికాడా దెప్పొండేసినాడు. మరియ్యాల దాన్ని బుగ్గిసెయ్యినానికి రమ్మంటే మొకం సాటుచేసుకొన్నాడు సూడంగ్రయ్యా అని ఏ ముష్టి నా కొడుకేనా అని గల్డని బయ్యివేసి పోలెప్పి గాడు బయలెల్లినాడు స్మసేఁనంకాడికి. అలా కాకపోతే - కరాపూర్లో నిత్తిఁవూ నచ్చీజనాలెనకాతల యీడు పతీరోజా స్మసేనంకాడికిపరిగేడ్తాంటాడేటి ? కానయితి మరిక్కడ మాత్రం ఎల్లక తప్పనేదు.

తప్పుసేసినోడికి మనసు నాగుతూనే వుంటాదిట. ఇదిగీ పోలెప్పిగాడేనయ్య ఆ

సూరిముండనొత్తి అనాదిముండన్సేసి సవాగ్గ దెప్పెండేసినాడు-అని ఎపుడేనా అనేస్తాడని బయఁవ్ నేదేటాడికి ? అయితా డెలా బయిపడ్నాడో ఆ పెకారఁవే జరిగింది.

దగ్గిరోడు లచ్చియ్యమాఁవే కక్కేసినాడు గదా ఆమాట - మరి కడఁవోల్ల నెక్కేటి? ఆడన్నాడు గదా ' ఓరయ్య పోలెప్పి, మోనిరుడు ఆ ముండ నీక్కంక ర్దెప్పిసవాగ్గిచ్చినేదా? అయితదెందుకిచ్చినాదో నీ కెరికా ? దానికలాటిఅపతొచ్చి పడ్నాక అమ్మ కోకేటిసేస్తాది? ఇయాళదొట్టి సింకిముండనా అవు పిస్తందిగానోరే - సిన్నప్పుడు , ఏది, దాన్సిన్నప్పుడు, అదెనాగుండీదెరికా? సంపిరిజుత్తయితేనేంగాక, సినకనాగుండీదనుకో. అదిగజ్జూసే కదా నీలిగాడు - అనా సూస్తావేటి - మన సొట్టప్పియ్యగాడి బామ్మర్దిరా - అనా సూస్తావేటి ? - ఆడు దీన్ని పెల్లిచేసుకుంటానని పట్టుపట్టి మరీ కూకున్నాడు. ఒద్దు రోరయ్య, అనాటి పన్జెయ్యకు- దానికో పిచ్చిముండ సెల్లెలు, సొట్టెదవో అన్నా వున్నారు. దీని సోకు సూసి పెల్లా డ్నావంటే గోతుల్దిగినావని నెక్కేస్కో అని వూరు వూరల్ల ఆడికి బోదపర్సినారు. అయితా డింటేనా ? ఓరయ్య ! కాలంలోవున్నోడికి యే ఆడకూతురి మీదేన మనసు నెగిసిందంటే, ఆడు దానిమాయలో దిగబడిపోన్డన్నమాటే. మరి కల్లవుపడతాయను కున్నావేటి ? సూసినావా, ఈ నీలిగాడి పనీ అదే అయింది. ఎవుడు సెప్పినా యినకుండా, దాన్ని పెల్లాడేసినాడు. ఆడేసి,యేటనుబగించేసినాడు ? ఆర్నెల్లు తిరక్కంట సచ్చిపోన్డు. నీ గ్గేపకం నేదేటి- నాయుడోరింట్లో పెల్లయిన్నాడు బూజులట్టేసిన అరిసెలొడ్డించేసినారు - అయితిని వోంతులు, ఇరోసినాలు యెట్టి కొని అరడజనుమంది సచ్చిపోన్రుకదా - అదిగలా సచ్చినోళ్ళలో ఈనీలిగా డొక డన్నమాట.

అదిగదిమొదుల్రా దీని కారంబవయింది కష్టిం. వొయిసులోవున్న గుంటా - మరిదాన్ని సూత్తప్పటికి పతికుర్రనాకొడుక్కి నోరూరిపోయి, బేపిలా నాలికెళ్ళబెట్టేసేవోడనుకో. అయితే ఏ నాకొడుక్కి దయిర్యంసాల్లేదు దాన్ని మారుమనువు సేస్కోడానికి. ఏలంటావ్ ? దుక్కముక్కనాంటి నీలిగోడు నాల్రోల్తిరక్కంటా సచ్చినాడుకదా దీన్నికట్టుకొని - మరి దెంతటి అదుష్టం ముండోతెల్డంనేదేటి దాన్నిబట్టి? పోనంతకీ కాదని తెగించి దయిర్యం సేసి ఎపుడేనా సేసుకుందావనుకున్నా, దీని సెల్లీ, అన్నా - ఆల్లిద్దర్నీ కూడ ఏ నంజికొడుకు అరణం దెచ్చుకుంటాడు నివ్వే సెప్మే !

అయితదీ పెల్లికోసం ఎదుపులాళ్ళేదు సుమా. ఒరే లచ్చియ్య దద్దా! నన్ను సేస్కోని ఆడేటి సుకపడి పోన్డు, కడవోళ్ళేటి సుకపడిపోతారు,నాబతుకింతేన్ర దద్ద అని కళ్ళనిండనీల్లెట్టుకునిదనుకో. ఒరెయ్య పోలెప్పి, అమాయిదారిదేపుడేఁవి కల్లెట్టాడ నుకున్నావేటి దానికి ? సెక్కరాల్రా. ఆ కల్లల్ల నీల్లుట్టితే - ఎంతటోడికేనా దుక్కఁవ్‌తో గుండె సెరువయి పోయాదనుకో.

అయినకొరె - అదిపడ్డ బాదలు నాన్సెప్పన్రయ్య. ఇంటికాడపిచ్చిముండనొగ్గిపన్లో కెల్లనేదు.

మాన్నేదు.

అయితాపిచ్చిముండో - అదికూడ నేగపెయ్యినాగ నోరూవాయిలేని ముండనుకో - అనా కూకునే వుండేది - నోట్లోయేదో సనుక్కోని. ఇన్ని మంచి నీళ్ళుతాగాలన్న, ఓబయిర్భావికెల్లాలన్నా, బుక్కడు గెంజి తాగాలన్న - అప్పరావాల, దానికి బోదపర్సాల, నేకపోతే అది సస్తే నేగిసీది కాదె కూకున్న కాడ్నించి. అయితే సూరిముండ గోలేటెరికా ? నానేటి సేతునో, గుడిసినోకి బేపుల్దూరి అంబలి కతికేస్తన్న, సెయ్యి దులిపి దాన్నదర్దు కదా నా నెందల పడిపోదును ? అని నెత్తి బాదుకునీ దోరే. అయితివన్నీ ఉత్తి కేకలే న్రారె - దాని పేణాలు మాతరం నిత్తెంవూ అ పిచ్చిముండ సెల్లిమీదనే ఉండీవి సుమా !

కడుపు జరక్క కొసకి కూలి పన్లకి దిగిందిరా ఈ సూరి. అయితే ఓ పాలేటయిందెరికా? నర్సు నాయిడీరకాడు నేడా - రాంవినాయుడు - ముసిల్నాకొడుక్కి ఈ సూరినాటి కూతుళ్ళు ముగ్గురున్నారు. మరలాటోడికేటి పోయీకాలవొంవచ్చిందో - కల్లానికి పేడలుకుతూంటే ఈసూరి సెయ్యట్టుకున్నాట్ట. ఏటోరయ్య ముసిలోడివయిపోతన్న సిల్లరపన్లకేంవీ తక్కవలేదన్నమాట ! సెయ్యొగ్గుతావా, పేడకుప్పల బుర్రదూర్సి కుమ్మీమంటావా ? అనడిగిందటిసూరి. అంతపనీ సేస్తాదేటో నని జడిసి గావాలయీడు గభీమని సెయ్యొగ్గిసినాడట. అ ఎనక గాలోన్నా తగులుకుందట్ర - ఏటని? ఏట్రో రయ్య, అంత లావుగా నామీద్దీవేసిందా? అయితే, బేగి సెస్కోరా మనువు - నానూ కాలీ గున్నాను - అని. దెబ్బకి ముసిల్నాకొడుకు బెంబేలెత్తిపోనడు. ఐతే, ఆడేంసిన్నింటోడా? మర్నాటికాణ్నిండి దీనికూర్లో కూలి పుట్టకుంట సేసీనాడు. ఈఏల గేంవాల నిండా రాంవినాయుడ్లాటి రావనాసుర్లే కదా - అల్లు తల్సుకుంటే యేమడిసి మసైపోకం టుంటాడు సెప్పు?

అప్పటికాడ్నిండి యిదిగీ ముండాకూతురు పట్టవంటెల్లి, కూలి, నాలిసెస్కోని బతికింది. పట్నాలంట దొరికి కూల్లు నీకు తెలవేట్రా? ఈ కూలిముండనే తాపీమేస్త్రయినా పన్లోకొట్టికెల్లి నాడంటే దీనికిచ్చిన ముష్టికూల్లబ్బుల్ల ఆడికి కంవిసన్ కావాల. రోడ్డుకాంట్రాట్టరు పిలిసినాడంటే ఆడిక్కంవిసన్. ఇవన్నీపోగా రోజుకొచ్చీదెంత? అందల ముగ్గురు మనుసులేటితినాల? పోనీ మగనంజి కొడుకు దానన్నున్నాడు గదా - ఆడ్ని కూలికి తోల్దుంవంటే - ఆడు సొట్ట నంజికొడుకయిపోన్డు. సేన్లో బక్కల్దూరిపోకండా కాయనానికేనా ఈడికి కాలుండాల గదా ! మనమడకని అవిటోడికేటుందరా బతకనానికి? అంచేత ఆడుకూడా యీ ఆడదాయి తెచ్చిన్దానిమీదే బతకవొలిసొచ్చింది. ఆడ కూతురు - అలాగే యీడ్సుకొచ్చిందనకో - యేదో బొందిల పేణాలు మాత్రం వున్నాయనిపిచ్చుకొని. పూరాగ గెంజినీళ్ళ మీద ఎంత కాలంవేటి ఈ బతుకెల్తాది ? ఎంవికిలు బయలెల్లిపోయినాయి. దాంతో తాపీ మేస్తిర్లు. రోడ్లుకాంటాట్టర్లు దీన్ని పన్లోకి రావొద్దనీసారు. నువ్వేటి సేస్తావే ముండా -

ఒంటిని సీతకల్తప్పమావఁసంనేదు- పోపో అని తరిఁవీసీవోరట.

అయినక, కాయిలా అయిపోనాది - అది గప్పిడే గావాల - దాని మెడ్లొంచి ఆ కంకరమడక సీపేఁరా యించీసినాను. అయితిందల మనం 'సేసిన అన్నాయఁవే ఏీలేదునుమా. గంగొడ్డుస్సిలబడిపెమాణికంగా సెపుతున్నాను - నాన్దానిగ్గాని, ఆ మాటకొస్తే ఎపుడుగ్గాని అన్నాయం యీ నాటివరకూ సెయ్యనేదురయ్య - ఆ కంకరదెప్పి పాతిక సెంట్లుంటాదా -మర్దాన్ని సాగు సెయ్యనానికి దానికాడేటుందిరా - ఏరా, ఎద్దా, యితనాలా - ఏటున్నాయి? ఇయన్నీ కావాలంటే సేతల డబ్బుండాల - మరి దీని సేతల సిల్లిగవ్వ నేదు కదా ! పొలం తనకారాయిచ్చుకొని, కోఁవిటోడు దీనికి మదుపిచ్చినాడనుకో, ఏటి సుకం? పండిన గిద్దెడో, సోల్డో ఆడికొట్టుకే తోలాల గదా మరి! అలాటప్పుడు మరి దీనికేట్నాబం? నాలుగు నెల్లపాటు సీవూ, రగతం ఒడిసి కష్టపడి కసిన్ని గింజలు పండిస్తే ఆ కసిన్నీ అసలనో, వొడ్డీయనో ఆడు తోలికెలిపోతే మనకి మిగిలేదేఁట్రా? కష్టింవే దక్కుడు. అయితీ బాదలు దీనికొక్కర్తికే అనుకుంటున్నావేటి ? కాదుఁరయ్య, ఇప్పుడీగవుర్ మెంటు ఎనకబడినోల్లకనీ, మాలోల్లకని సెక్కాముక్కా యిస్తన్నదికదా, మరామడకలన్నీ ఆల్లసాగుల్లోనే వున్నాయనుకున్నావేటి? బూఁవయితేయిచ్చీసినారుగాని ఆళ్ళకాడేటుందనిరా పండించనానికి? మరి సుట్టూరా నక్కపోతుల్లాగ ఈ నర్సునాయుళ్ళు కనిపెట్టుకొని సూస్తానే వున్నారు.- ఆడెప్పుడు సంయ్ అంటాడా, బూఁవేండేద్దుఁవాలని.

మరీ సూరిముండ పనీ అదే అయ్యిండీదనుకో, ఎపుడో ఎగరేసుకుపోకంట, నువ్వు నా మేనల్లుడి వన్జెప్పి, నీకా దెప్పి రాయించీనాను. నాను కనక దానికా కానీ, పరకేనా ముట్టినాది. ఏ నర్సునాయుడో అయితే, బూఁవిమానాన్నబూఁవి రాయిచ్చీసుకుండున్న- డబ్బుమాటెత్తితే వల్లకూరుకోడఁవో, మూతి మిత్తన్నడఁవోసేసును. ఇదేటినాగని అల్లనడగ్గల్సిన మొగోడున్నాడేటి? సెప్పినానుగదయ్య, యీ మోతుబర్లున్నారే - ఆల్లే ఈయేళ్ళ రావనాసుర్లు, యిరణ్య కసిపుల్లూ అయికూకున్నారనుకో. ఓ పక్క నుండేవో గవుర్మెంట్ కంయ్, కంయ్మని కాగ్గోల - బీదాబిక్కికి అదిసేసేనావ్, ఇదిసేసీసినావ్అని. తీరాసూస్తే - ఏటీజరగనేదిక్కడ. ఈనాకొడుకులుమాత్తరం రోజురోజుకి పులిసిపోయి బలిసిపోతన్నారు.

'అయితొరే మాఁవా, మరానకేటయిందిరా ? ' అనడిగినాడు పోలెప్పి. 'ఏటయిందా ? ఏటవుద్దిరా - ఓరి ! యిన్నాల్లబట్టి పేద్ద కరావూర్లో వుద్దోగం సేస్తన్నావ్ కదా అమాతరం ఆలోసించనేక పోనావేఁట్ర ! నువ్విచ్చిన పైసో, పరకో కరుసయి పోయింది. సేతనున్న కానో పరకో కరుసయి పోయి సాకిరీ సెయ్యనానికి ఒంట్లోదమ్మిడెత్తు బలం లేనోళ్ళంతా ఏటవుతారో అదే దీనికి అయిందిరా. ఖాయిలా అయిపోనాదని సెప్పినానా, ఏటో ఖాయిలా అనుకున్నాం. ఆ మద్దిన గావాల ఓనాడు

సెప్పినాడు మన సైకిల్దాట్రు - ఎర్రగా, పలసగుండి, సైకిల్ఏత్తిరిగియిండీసన్లయీ యిస్తంటాడుసూడు, ఆడాట్రా! అడేటిసెప్పినాడేరికా? దానికిమనవేటిసెయ్యగలంరా - మనందర్కీ తెలిసిర్రోగఁవే, మన్దేశఁవ్ల శానా మందికొచ్చే జబ్బే - ఏటలా సూస్తావ్, అకల్జబ్బురా అని. ఒరే పోలెప్పి, యాత్తర్లకని - నాను కలకత్తా ఎల్లేను, కాసీ ఎల్లేను, సెన్నపట్నం ఎల్లేను. రాఁవీస్సరం ఎల్లేను - కాని ఎక్కడికెల్లినా, ఎక్కడ సూసినా కనపడేవోళ్ళల్లా ఈ అకల్జబ్బోళ్ళేర్రా . ఆ జబ్బుతోనే కొస కాళ్ళు సస్తారు. ఈ సూరిముండ కూడా ఆ జబ్బుతోనే సచ్చింది. సివర్దాకా నాసెల్లో, నా యన్నో అనే గోలెట్టిదారే. డబ్బుకి బీదముండే కాని, అపిమానాలకేం తక్కువ నేదురా"

" అయితిదిసచ్చిందిగదా, మరామిగిల్నోళ్ళమాటేట్రా లచ్చియ్య మాఁవా?"

" ఎవుళ్ళది - సూరిముండ అన్నా, సెల్లీ సంగతా ? సచ్చిందాయి సంగతేటో బతికున్నోళ్ళ సంగతీ అదే. ఇలాటోళ్ళు లచ్చలమీదున్నార్రా మన మడకని. అళ్ళంతా అన్నాల కలఁవటించిపోయి ఆకళ్ళతో సావాల్సిందే. ఇయ్యాళిది సచ్చింది. రేపుమరోడు సస్తాడు. అంతే. పద పదమీ అలీసఁవయిపోనాది. మీయత్త తిండి తినకంట కనిబెట్టు క్కూకొనుంటాది. మన బీదోళ్ళ బతుకులుకి ఏటీ మిగల్లేదురారే ! కసింత అపిమానాలే మిగిలిపోనాయి. నడ్డడు."

(29-4-1977 -ఆంధ్రజ్యోతి)

✪ ✪ ✪